


# పారెలెల్లో గ్రాం

*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

**"ఆంటీ, సీ దిస్.. ఐ మేడ్ పాలెలెలెల్లోగ్రాం"** అర్చన చున్నీని పట్టుకుని లాగుతూ పెద్దగా అన్నాడు నీహార్. గిరుక్కున వెనక్కి తిరిగిన టీచర్ అర్చన కళ్ళల్లో అప్రయత్నంగానే కన్నీరు తిరిగింది. కొనగోట తుడుచుకుంటూ కంటి కొలకుల్లోంచి పక్కనే నిలబడి ఉన్న తండ్రి రమేష్‌ని చూసింది.

***దాదాపు నాలుగేళ్ళ క్రితం..***

"నాకు చదువు చెప్పిన టీచర్లు కూడా బ్రిలియంట్ స్టూడెంట్సే నాన్నా, మీ అభ్యంతరమేమిటో నాకర్థం కావటంలేదు, వుడ్ యూ హేవ్ లైక్డ్ ఇఫ్ యువర్ డాటర్ హేడ్ మీడియోకర్ టీచర్స్? బ్రిలియంట్ స్టూడెంట్స్ తయారవాలంటే తెలివైన, ఓపిక ఉన్న టీచర్స్ కావాలి నాన్నా! " నెమ్మదిగా అంది అర్చన.

చార్టర్డ్ అకౌంటెన్సీ చేస్తానని మొదలు పెట్టి మొదటి గ్రూప్ కూడా రాయకుండానే తాను బీ.ఎడ్, మోంటిసోరీ శిక్షణ పొంది టీచర్‌గా పనిచెయ్యాలనుకుంటున్నానని, అంతే కాక బుద్ధిమాంద్యత ఉన్న పిల్లలకోసం పనిచెయ్యాలని ఉందని అతని కూతురు అర్చన చెప్పినప్పుడు కోపంతో ఊగిపోయాడు రమేష్.

ఆ రోజు కోచింగ్ క్లాస్ నించి వస్తూనే సోఫాలో బాగ్ విసిరి కూర్చుంది అర్చన.

"ఏమయిందిరా?" మెల్లగానే అడిగాడు అక్కడే కూర్చుని టీ.వీ చూస్తున్న రమేష్.

"నాన్నా నాకు సీ.ఏ కోర్స్ చదవాలని లేదు" అంది కొంచెం విసుగ్గా.

"కష్టమైన కోర్స్ కదా, అలానే అనిపిస్తుంది మొదట" అన్నాడు తేలిగ్గా నవ్వుతూ.

"కష్టం అని కాదు నాన్నా, ఐ డోంట్ థింక్ ఐ. విల్ ఎంజాయ్ దిస్. ఐ వాంటూ డూ సంథింగ్ డిఫరెంట్" అంది.. ఈ సారి ఆమె గొంతులో స్థిరత్వం.

"సంథింగ్ డిఫరెంట్??" ముమ్మూర్తులా తనలాగే ఆలోచిస్తున్న కూతురిని చూస్తే ముచ్చటేసింది. టీవీసౌండ్ తగ్గించి కూతురి దగ్గరగా జరిగాడు.

"దట్ ఈజ్ నైస్, టెల్ల్ మీ వాట్ ఈజ్ ఇట్?" అన్నాడు అనునయంగా.

అప్పుడు చెప్పింది అర్చన మెల్లగా.

" నువ్వు చాలా తెలివైన పిల్లవి? టీచర్ పని చెయ్యడమేమిటి? అసలేం మాట్లాడుతున్నావో అర్థం అవుతోందా?" అని కేకలు వేశాడు. తెలివైనదానివి, టీచర్ పని ఏమిటి అన్న తండ్రి ప్రశ్నకి అర్చన ఇచ్చిన సమాధానమే అది.

అతనొక పెద్ద మెకానికల్ ఇంజనియర్. చాలా కాలం పెద్ద, పెద్ద కంపెనీలలో పనిచేసి ఈ మధ్యనే తన సొంత పరిశ్రమ పెట్టుకున్నాడు. భార్య రూప సాఫ్ట్‌వేర్ ఇంజనియర్. ఇద్దరూ కలిసి తమ కంపెనీ పనులన్నీ చూసుకుంటారు. వీరు కాక మరోక నలభైమంది పనిచేస్తున్నారు వాళ్ళ కంపెనీలో. వాళ్ళ ఏకైక కూతురు అర్చన. చిన్నప్పటినించీ చాలా చురుకైనది,

తెలివైనది, చదువులోనూ, ఆటపాటల్లోనూ ఎప్పుడూ ముందే ప్రత్యేకించి బాడ్మింటన్, స్విమ్మింగ్‌లలో జాతీయ స్థాయి వరకూ కూడా వెళ్ళింది. ఇంటర్ చదువయ్యాకా తనకి సీ.ఏ చదవాలని ఉందనీ, దానికి తగినవిధంగా ఉంటుందని ఎం.సీఏ గ్రూప్ తీసుకుంది. సీ.పీ.టీ అనే ప్రవేశ పరీక్ష అవలీలగా పాస్ అయింది, ఒక పక్క సీ.ఏ కోర్స్ కీ, మరొక పక్క బీ.కాం కోర్స్ కీ చదవడం మొదలుపెట్టింది.

రమేష్‌కి అర్చన అంటే ప్రాణం. చిన్నప్పటినించీ ఏదడిగినా లేదనకుండా కొనిచ్చేవాడు. చాలా విషయాలు దగ్గరుండి నేర్పించేవాడు. తనొక్క మాట అనేవాడు కాదు, రూపని అననిచ్చేవాడు కాదు.

"మీరిలా నెత్తినెక్కించుకుంటే అది రేపు చెప్పినమాట వినదు" అని రూప గొడవ చేస్తే,

"మన చిట్టితల్లంటే ఏమనుకున్నావ్? అలా ఎప్పటికీ జరగదు" అనేవాడు పైగా.

అతనికి తన కూతురు కూడా తనలాగే ఇంజనీరింగ్ చదివితే బావుంటుంది అని ఉండేది. కానీ అర్చన పదో తరగతి అవగానే తనకి సీ.ఏ కోర్స్ చెయ్యాలని ఉందనీ, దానికి తగ్గ కోర్స్ ఇంటర్‌లో ఎంచుకుంటానని చెప్పినప్పుడు కూడా అతను సంతోషించాడు తప్ప ఆమెనేమీ అనలేదు.

"గుడ్ చాయిస్ తల్లీ, ప్రతీఏడూ లక్షల సంఖ్యలో ఇంజనీర్లు తయారవుతుంటే, సీ.ఏ లు వందల్లో మాత్రమే ఉన్నారు. ఐ. యాం గ్లాడ్ దట్ యూ వాంట్ టూ డూ దట్." అన్నాడు నవ్వుతూ.

అంతే కానీ తను ఐ.ఐ.టీ సీటు కొద్దిలో మిస్ అయ్యాడు కనక కూతురు కొద్దిగా కష్టపడితే అది సాధించగలదన్న విషయాన్ని పక్కన పెట్టేశాడు పూర్తిగా. అలా అర్చన సీ.ఏ లో చేరింది.

రమేష్‌కి మొదటినించీ కూడా తను చాలా విభిన్నంగానూ, గొప్పగానూ ఉండాలని తాపత్రయం. మూసలో పోసినట్టు, ఫాక్టరీలో తయారయినట్టు అందరిలా ఒకేలా ఉండడం అతని వల్ల కాదు. అలా ఉండడం పెద్ద అవమానకరంగా భావించేవాడు కూడా.

అలాంటిది ఇప్పుడు అర్చన కేవలం (అతని దృష్టిలో) ఒక మాంటిసోరీ టీచర్ గా మారతాననడం అతనికి అస్సలు మింగుడు పడలేదు. మొదటిసారి అర్చన మీద పెద్దగా కేకలు వేశాడు. కొట్టినంత పని చేశాడు. రూప ఎంత వారించినా అతని ఆవేశం తగ్గించుకోలేక పోయాడు. "మనమెప్పుడూ అందరు తల్లితండ్రుల్లా మన అభిప్రాయాలు దానిమీద రుద్దలేదు, ఇలా చెయ్యి, అలా చదువు అని చెప్పలేదు. కానీ ఇది మాత్రం, నాకెందుకో అసలు ఆలోచించడానికే మనసు ఒప్పడం లేదు. ఇట్ ఈజ్ అట్టర్ నాన్సెన్స్" అన్నాడు కోపంగా.

రూప చాలా నిదానంగా ఉంటుంది, తొందరగా మాట జారదు, కంగారుగా ఏదీ చెయ్యదు, గత రెండురోజులుగా తండ్రీ కూతుళ్ళ మధ్యన జరుగుతున్న వ్యవహారాన్నంతా గమనిస్తోంది.

కొన్నిరోజులు మామూలు మాంటిసోరీ స్కూల్‌లో పనిచేసి తర్వాత ప్రత్యేక అవసరాలున్న పిల్లలకి చదువు చెప్పాలనేది తన ఆశయం అని అర్చన మృదువుగానే అయినా స్థిరంగా చెప్పినప్పుడామె కొంత ఆశ్చర్యపోయినా, రమేష్‌లా షాక్ తినలేదు. ఎందుకంటే మొదటినించీ రెండో పక్కన కూడా చూడటం ఆమెకి అలవాటు.

"నీకు తెలుసా టీచర్ కోర్స్ చేస్తే ఎంత జీతం ఇస్తారో? మహా ఇస్తే పదివేలు, పదిహేనువేలు.. దేర్ ఈజ్ నో మనీ ఇన్ దట్ ప్రొఫెషన్. నువ్వు సీ.ఏ చదివి మన కంపెనీలోనే చేరతావని నేను ఎంత అనుకున్నానో" అన్నాడు

"నాకు తెలుసు నాన్నా, మనకుంది కదా డబ్బు, ఇంకా ఎందుకు? ఎందుకు ఎక్కువ సంపాదించాలి? దేనికోసం? అయినా మనిషి తలుచుకోవాలే కానీ డబ్బు సంపాదించడం పెద్ద గొప్ప విషయమూ కాదూ, అంత కష్టమూ కాదు, ఒకసారి సంపాదించడమంటూ మొదలుపెడితే అదొక విషచక్రం, నాకలాంటిదాంట్లో చిక్కుకుపోవడం ఇష్టంలేదు. ఎప్పటికైనా నాదంటూ ఒక స్కూల్ పెట్టుకోవాలని అనిపిస్తోంది, అది చిన్నదైనా సరే " అంది.

"డబ్బు సంపాదించడం కష్టం కాదా? నోట్లో వెండి చెంచా పెట్టుకుని పుట్టిన నీలాంటి వారికేం తెలుస్తుంది? నాకు తెలుసు. మా నాన్నగారు స్కూల్ లో టీచర్ గా పనిచేసేవారు. మేము నలుగురం పిల్లలం, చుట్టాలూ, మా తాత, బామ్మలు. అలా ఉండి ఉంటే తెలిసేది నీకు. నేను అమ్మా నీకు చిన్నప్పటినించీ అడక్కుండానే అన్నీ అమర్చి పెడుతూంటే ఎలా తెలుస్తుంది? " అన్నాడు వెక్కిరిస్తున్నట్టుగా.

"అవును నాన్నా, ఎవరికైనా లేని దాని విలువే బాగా తెలుస్తుంది. కష్టపడి పైకి వచ్చిన నీకు సుఖంగా హాయిగా ఉండడం మీద మక్కువ ఉండడంలో తప్పులేదు. నేనడిగిన బొమ్మలూ, బట్టలూ బ్రహ్మాండమైన స్కూళ్ళూ, ఫారిన్ హాలిడేలూ అన్నీ ఇచ్చారు మీరు, హాయిగా జాయ్ రైడ్ లా సాగిపోయింది నా జీవితం ఇప్పటివరకూ. నా తల్లితండ్రులుగా మీరు నా లైఫ్ ఇలానే ఉండాలని ఆశించడంలో తప్పులేదు, కానీ నాకు నేనుగా ఏదైనా విభిన్నంగా సాధించాలని ఉంది. "అంది తనూ గట్టిగానే.

"మరి అన్నీ తెలిసిన దానివి ఇలాంటి వెర్రి పని ఎందుకు చెయ్యాలనుకుంటున్నావో అది కూడా చెప్పు. " అన్నాడు వ్యంగ్యంగా.

"ఈ రంగాన్ని ఎంచుకోవడానికి కూడా ఒక కారణం ఉంది నాన్నా, అదేమిటో చెప్పనా?అదీ, అది... ఛాయత్త" అంది చాలా నిదానంగా.

"ఛాయత్తా"? దానిగురించి నీకేం తెలుసు? మీ అమ్మకే సరిగా తెలీదు " విపరీతమైన ఆశ్చర్యంతో అన్నాడు రమేష్ ఆశ్చర్యంగా.

"నిజమే, మా అమ్మకి సరిగా తెలియకపోవచ్చు, కానీ మీ అమ్మకి? కన్నతల్లిగా నాన్నమ్మకి తెలుసుగా" . అంది మరింత నిదానంగా.

"అయితే? "అర్థం కానట్టుగా అడిగాడు.

"ప్రతీ సంవత్సరం నరకచతుర్దశి నాడు నాన్నమ్మ పొద్దున్నే కంట నీరు పెట్టుకోవడం, అన్యమనస్కంగా ఉండడం నాకు తెలుసు నాన్నా, ఎప్పటిలాగే దీపావళికి ఛాయత్త లేని ఊరిలో ఉండలేక వాళ్ళు క్రిందటి సంవత్సరం మన దగ్గరకి వచ్చినప్పుడు నాన్నమ్మ బాగా ఏడిచింది. అది చూసి నేనడిగితే అతి కష్టం మీద చెప్పింది ఛాయత్త సంగతి. " ఆరోజు ఛాయత్త పుట్టినరోజనీ, ఆవిడంటే మీకెంతో ప్రాణమనీ" మొదలుపెట్టి ""అప్పుడే నాకు తెలిసింది పూర్తిగా "అంది కొంచం ఎమోషనల్ గా.

"ఛాయత్త చాలా అందంగా ఉండేదిట, అందరికంటే చిన్నది అని తాతగారు చాలా గారం చేసేవారుట. కానీ తనకున్న లోపాన్ని కనిపెట్టలేక పోయారుట. అది చాలా చిన్న డెవెలప్‌మెంటల్ డిజెబిలిటీ అయి ఉండవచ్చు అది. కానీ ఎవరూ గుర్తించలేకపోయేసరికి అది పెద్ద జబ్బుగా చిత్రీకరించబడి అలా జరిగిపోయింది. " అంది ఆవేదనగా.

" షీ ప్రాబబ్లీ హాడ్ మైల్డ్ ఆటిజం, తెలీదు. కానీ చాయత్త కథ నానమ్మ చెప్పినప్పుడెంత కదిలిపోయానో తెలుసా నాన్నా? "

రమేష్ వింటున్నాడో లేదో తెలియనట్టుగా కూర్చుని ఉండిపోయాడు. అతని కళ్ళనిండా నీరు. నీటితో పాటు నిండిపోయిన చెల్లెలి రూపం. తెల్లగా, చిన్నగా బొమ్మలా పుట్టిన చెల్లెలిని చూసి ఎంత సంబరపడిపోయారో అక్కా, అన్నయ్య తనూ. అక్కపేరు ఉష కనక దానికి తోడుగా, నీడగా ఉండే చెల్లి కదా అని "ఛాయ" అని పేరు పెట్టారు నాన్న. ముఖమ్మీదకి పడిపోయే ఉంగరాల జుట్టు, యాపిల్ పళ్ళలాంటి బుగ్గలూ, నల్లని, చిక్కని కళ్ళూ ఎంత ముద్దుగా ఉండేదో, తనకంటే నాలుగేళ్ళు చిన్నది.

దాదాపు రెండేళ్ళు పట్టింది ఛాయ తమలా, మామూలుగా లేదని గుర్తించడానికి.

మొదట ఎవరూ గమనించలేదు కానీ క్రమక్రమంగా తెలిసింది. అయినా సరే మాటలు రావడం, నడక రావడం - ఆలస్యం అనుకున్నారే తప్ప అదొక పెద్ద సమస్య అని ఎవరూ అనుకోలేదు, అందరికంటే ముందుగా గుర్తించినది వాళ్ళ అమ్మ. మిగతా పిల్లల్లా చురుగ్గా లేకపోవడమూ, చెప్పినది అర్థం చేసుకోలేకపోవడమూ, చాలాసార్లు తన పేరే పిలిచినా సరే, పలకకపోవడమూ ఇవన్నీ ఆమెనెంతో కలవరపెట్టాయి. రెండు మూడు సార్లు భర్తతో చెప్పింది, " పట్నంలో ఎవరైనా పెద్ద డాక్టర్ కి చూపిద్దాం" అని. కానీ అతను దాన్నో పెద్ద విషయంగా అనుకోలేదు, " రెండు నాళ్ళుపోతే అన్నీ అవే వస్తాయి, ఊరికే నువ్వు కంగారు పడి నన్ను పెట్టకు " అని చిరాకు పడ్డాడు.

కానీ ఐదేళ్ళు నిండినా ఛాయకి కనీసం రెండేళ్ళ పిల్లలకుండాల్సిన తెలివితేటలు లేవన్నట్టుగా ప్రవర్తించేది. ఎప్పుడూ ఒక్కర్తే కూర్చుని ఒకటే బొమ్మతో ఆడుకునేది. దానికే పదిసార్లు తల దువ్వి జడలు వెయ్యడం, పోనీటెయిల్ కట్టడం ఇలాంటివి చేసేది. హాల్లో కుర్చీలు అవీ జరిపి తుడుస్తానంటే ఒప్పుకునేది కాదు, ఒకవేళ మార్చినా, మళ్ళీ వాటిని తిరిగి అక్కడ పెట్టేవరకూ ఏడ్చి ఇల్లంతా ఏకం చేసేది. తినడం కూడా అంతే, ఇష్టమైనప్పుడు ఆపమన్నా వినకుండా వెర్రి తిండి తినేది, లేనప్పుడు ఎంత చెప్పినా ముట్టుకునేదికాదు.

ఛాయకి ఆరేళ్ళు వచ్చేసరికి అందరూ ఆ అమ్మాయిని "సూర్యంగారమ్మాయి పిచ్చిపిల్ల" అని ముద్ర వేశేశారు.

"పిల్ల ఎంత బావుంటేనేం? బుద్ధి సరి లేకపోయాకా? అని పెద్దవాళ్ళు అనుకుంటే,

చాయ తమలా లేదని తోటి పిల్లలు గుర్తించి "మీ చెల్లిని తీసుకురావద్దు, మన ఆటలన్నీ పాడు చేస్తుంది" అని ఉషని హెచ్చరించేవారు.

స్కూల్ లో వెయ్యడానికి ప్రయత్నించారు, రెండు మూడు రోజులయ్యాకా తన పలక మీద ఎవరో ఏదో రాశారని ఆ పిల్లాడిని పట్టుకుని చావబాదేసింది. " ఈ అమ్మాయికి ఏం చెప్పినా తెలియడం లేదు, పైగా అందరితోనూ గొడవలు " అని పంపేశారు దాదాపు రెండు నెలల తర్వాత.

రమేష్ నాన్నగారికి విషయం అర్థం అయినా ఏం చెయ్యాలో తెలియని పరిస్థితి, ఆఊరిలో ఉన్న చిన్న డాక్టర్ గారికి చూపిస్తే " పరవాలేదండీ, కొన్నాళ్ళు పోతే అదే సర్దుకుంటుంది, మీరు కంగారు పడకండి" అన్నాడు తప్ప మరే రకమైన సహాయం చెయ్యలేదు.

నెమ్మదిగా కూర్చుని నేర్పిస్తే కొన్ని విషయాలు నేర్చుకోగలదని రమేష్ తల్లి సావిత్రమ్మ మాత్రమే గుర్తించింది. అందువల్ల తనే ఇంట్లో అక్షరాలు దిద్దించడమూ, చిన్న చిన్న శ్లోకాలు, పద్యాలు నేర్పడమూ మొదలుపెట్టింది. అలా పన్నెండేళ్ళు నిండినా కూడా పసిపిల్లలాగే ఉండిపోయింది ఛాయ. ఎప్పుడూ సావిత్రమ్మ కొంగు పట్టుకునే తిరిగేది నోట్లోవేలు వేసుకుని.

"అత్తా, మేము ఛాయని తీసుకెళ్ళమా ఆటకి" అంటూ వచ్చిన పిల్లలని వద్దనలేక

"జాగ్రత్తమ్మా, దానికంతగా తెలియదు, మీకు తెలుసు కదా, ఎక్కువ దూరం వెళ్ళకండి ఆటలకి" అంటూ హెచ్చరించి మరీ పంపింది ఆవిడ. దాని వరస చూసి ఎవరూ తమతో కలుపుకోకపోవడమే తెలిసినా ఆవిడకి అలా వాళ్ళంతట వాళ్ళు వచ్చి అడిగేసరికి చాలా సంతోషంగా అనిపించింది.

అలా వెళ్ళిన అరగంటకే ఛాయ చెరువులో పడిపోయిందన్న వార్త వచ్చింది, గబ గబా పరిగెత్తారు సావిత్రమ్మా, సూర్యంగారు. అప్పటికే చాలా దూరం కొట్టుకుపోయిందిట, మేకలకోసం కర్రకి కొడవలి కట్టి చెట్ల కొమ్మలు కోస్తున్న గంగడు చూసి నీళ్ళల్లో దూకి బయటకి తీసుకొచ్చాడు, కానీ అప్పటికే జరగాల్సింది జరిగిపోయింది.

మొన్నటి ఆటల్లో తన పరికిణీ చింపిందన్న కోపాన్ని ఏదో విధంగా తీర్చుకోవడానికే ఛాయ ని ఈ రోజు ఆటకి పిలిచి, ఏడిపించి ఇంటికి పంపుదామన్న ఆలోచనతోనే ఛాయని పిలిచిన స్నేహితురాలు అనుకోకుండా ఇలా జరగడంతో భయంతో బిక్కచచ్చిపోయింది, బిగుసుకుపోయి నోట మాట రాక ఉండిపోయింది, తక్కిన వాళ్ళిద్దరూ భోరు భోరున ఏడ్వడం మొదలు పెట్టారు.

పక్కటౌన్‌లో చదువుకుంటున్న రమేష్ ఈ విషయం తెలిసి తెగ ఆవేశ పడిపోయాడు, ఆ స్నేహితురాలింటికి తన స్నేహితులని తీసుకుని బయలుదేరాడు, ఏం చెయ్యాలో తెలీదు కానీ, ఏదో చెయ్యాలన్న ఆవేశంతో.

ఇంతలో తండ్రి ఆ పాడు. "ఊరుకోరా, మన పిల్ల ఎలాగూ లేదు, వాళ్ళసలే చాలా షాక్ లో ఉన్నారు, ఆ పిల్ల మూడు రోజులనించీ మూసిన కన్ను తెరవడం లేదు, అంత జ్వరం, ఒకటే కలవరింతలూ, దానికి తగ్గి మామూలుగా తిరిగితే చాలు. ఇంతకీ ఇదంతా మన ఖర్మ, అది అలా పుట్టడం, ఇలా దూరం కావడం. " అతని కంఠం రుద్ధమైంది.

ఇదంతా జరిగి దాదాపు ముప్ఫైఏళ్ళు కావస్తున్నా తలపుకొచ్చినప్పుడల్లా అతన్ని కలచివేస్తూనే ఉంటుంది. తన వెనకే పుట్టినందువల్ల అతనికి ఛాయతో ప్రత్యేకమైన అనుబంధం. తనని మాత్రమే "అన్నా" అనేది, అమ్మ తర్వాత తనతోనే చేరికగా ఉండేది. తన చెల్లిని ఎవరైనా పిచ్చిపిల్ల అంటే తనకి పట్టరాని కోపం వచ్చేది.

అతని కళ్ళవెంబడి జల జలా రాలుతున్న కన్నీరు చూసి రూప కంగారు పడింది, మెత్తగా అతని చెయ్యి పట్టుకుని "ఊరుకోండి రమేష్ హోల్డ్ యువర్ సెల్ఫ్ ప్లీజ్" అంది.

"ఇదే నాన్నా, నాన్నమ్మలో కూడా సేం ఎమోషన్ చూశాను. మార్కెట్ నించీ వస్తూ ఉంటే "అరుణకిరణ " అన్న మాంటిసోరీ మరియు స్పెషల్ స్కూల్ చూసి ఏమందో తెలుసా ? మీ ఛాయత్త ని కూడా ఇలాంటి స్కూల్‌కి పంపి ఉంటే నా తల్లి కూడా ఈ పాటికి చదువుకుని చక్కగా ఉండేది. ఎంత బాగా పాడేదనుకున్నావు? అన్నపూర్ణాష్టకం కూడా నేర్చుకుంది, తప్పు లేకుండా పాడేది. ఏమిటో అంతా మన ఖర్మ? పైకి అలా అన్నా కర్మ సిద్ధాంతాన్ని నమ్మని కన్నతల్లి హృదయం నాన్నా అది. ఈ కార్పోరేట్ చదువులతో విసిగిపోయి, మా నాన్నలాగే ఏదైనా విభిన్నంగా చెయ్యాలి అని నేను అనుకుంటున్న సమయంలోనే నాన్నమ్మ మాటలు నాకొక దారి చూపినట్టనిపించాయి. అందుకే నేను ఈ మార్గాన్ని ఎంచుకున్నాను. "

''వెంటనే కాదు లెండి. చిన్నపిల్లలతో ముఖ్యంగా ఆటిజం లాంటి సమస్యలున్న వారితో మెలగడం అంత సులభం కాదు, అందుకని గత కొన్ని వారాలుగా నేను వారానికి కొన్ని గంటల చొప్పున అక్కడ వాలంటీర్‌గా పనిచేస్తున్నాను. వారికి చదువు చెప్పడానికి నేను సరిపోతానా? అంత ఓపికా, కోరికా నాకు నిజంగా ఉందా ?అని పరీక్షించుకోవడానికి. ఇది స్కూల్ ప్రిన్సిపల్ భావనగారు ఇచ్చిన సలహా. నాకెంతో బాగా పనికి వచ్చింది, నన్ను తెలుసుకోవడానికి, నా పని తెలుసుకోవడానికీ కూడా.

నీకు తెలుసా అమ్మా, వాళ్ళతో మెలగడం మొదలుపెట్టినప్పటినించీ నా స్ట్రెస్ లెవెల్స్ ఎంత తగ్గాయో, నేను చాలా ఎంజాయ్ చేస్తున్నానమ్మా, మూడు నెలలు నన్ను నేను టెస్ట్ చేసుకున్నాకానే నేను ఈ నిర్ణయానికి వచ్చాను,నా డిగ్రీ కాగానే బీ.ఈ డీ తో పాటుగా కావలసిన శిక్షణ పొందుతాను. ఐ యా ం ష్యూర్, ఐ విల్ డూ వెల్'' అంది స్థిరంగా.

''ఏం నాన్నా, ఏం మాట్లాడరు? సీ.ఏ కోర్స్ ఎప్పుడైనా చెయ్యొచ్చు కదా, అలాగే డబ్బు కూడా ఎలాగైనా, ఎప్పుడైనా సంపాదించవచ్చు కూడా,కదా ''నవ్వింది మెత్తగా.

ఈ సంఘటన జరిగి సరిగ్గా నాలుగేళ్ళవుతోంది.

ఈ కాలంలో అర్చన ఒక పక్కన అరుణకిరణ స్కూల్‌లో పనిచేస్తూనే కావలసిన కోర్సులన్నీ పూర్తిచేసుకుంది. తను కోరి ఎంచుకున్న రంగం కావడం వల్ల చాలా శ్రద్ధగా పనిచేసేది. అది స్కూల్ యాజమాన్యం తొందరలోనే గుర్తించింది. ప్రిన్సిపల్ కూడా ఎంతో అంకిత భావం కల యువతి కావడాన ఎంతో చురుగ్గా పనిచేసేది. మామూలు మాంటిసోరీ ప్రీ స్కూళ్ళని కూడా కలిపారు. సిటీలోనే మరొక రెండు బ్రాంచిలని తెరిచారు. ఒకదానికి అర్చనని నిర్వహించమని ప్రిన్సిపాల్ కోరినప్పుడు, ''డైరెక్టర్, అరుణకిరణ మాంటిసోర్ స్కూల్'' అన్న విజిటింగ్ కార్డ్ ప్రింట్ చేయించుకున్నప్పుడు అర్చన పొంగిపోయింది.

తన కొత్త స్కూల్ చూడడానికి రమ్మని తల్లితండ్రులని ఆహ్వానించింది. అప్పటికా కొత్త బ్రాంచ్ ఓపెన్ చేసి దాదాపు రెండు నెలలవుతోంది.

'' ఆంటీ సీ దిస్.. ఐ మేడ్ పాలెలెలెల్లోగ్రాం.''

''వెరీ గుడ్, నాకు చూపించు ఎలా చేశావో? '' అంది సంబరంగా.

దానికి వాడు కిలకిలా నవ్వుతూ తన ముందున్న నాలుగు అగ్గిపుల్లలతో తను తయారు చేసిన చతురస్రంలాంటి ఆకారాన్ని చూపించాడు గర్వంగా. అది చతురస్రం కాదు, అలాగే కనిపించే పారలెల్లోగ్రాం.

అప్పుడు నిజంగానే అర్చన కళ్ళల్లోంచి నీరు వచ్చింది. " నాన్నా వీడిపేరు నీహార్. వీడిక్కడికి వచ్చినప్పుడు వాడికి తన పేరు చెప్పడం కూడా సరిగ్గా రాదు. ఇప్పుడీ నాలుగేళ్ళవాడు పేరలెల్లోగ్రాం చేసి నాకు చూపిస్తున్నాడు నాన్నా, ఈజింట్ హీ బ్రిలియంట్?" అంది చాలా ఉద్వేగంగా.

"అవున్నా, వాడే కాదు, వాడి టీచర్ కూడా బ్రిలియంట్, అంతే కాదు వాడు చూపించిన కారం ప్రాముఖ్యత ఏమిటో తెలుసా? చతురస్రంలా కనిపించినా "పారలెల్లోగ్రాంలు " వేరనీ, అన్ని పక్కలూ, అన్ని కోణాలు ఒకేలా కనిపిస్తూ కూడా ఒకేలా ఉండని సాకారమైన ఆకారమనీ. మనుషులందరూ కూడా చతురస్రాల్లా ఒకేలా కనిపించినా, వారిలో విభిన్నమైన కోణాలుండే "పారల్లెల్లోగ్రాం "లు కూడా ఉంటారని కూడా నాకర్ధమయిందిరా. ఐ యాం ప్రౌడ్ ఫ్ మై లిటిల్ డాటర్. ఐ ఓన్లీ విష్ వి హాడ్ సం పారలెల్లోగ్రాంస్ బాక్ దెన్ టూ. " అన్నాడు రమేష్ కూడా అంతే ఎమోషనల్‌గా.

●●●

Click here to share your comments on this story